అభివృద్ధి లేదు.. ఆహ్లాదం లేదు..

- అడవిని తలపిస్తున్న చిట్టూరి పార్క్
- అధ్వానంగా వాకింగ్ ట్రాక్
- ఆవరణమంతా పిచ్చి మొక్కలు, గడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పార్క్ అంటే పచ్చదనం, వాకింగ్ ట్రాక్, పిల్లల ఆట వస్తువులు, చుట్టూ పూల మొక్కలతో కళకళలాడుతూ ఉండాలి. బయట నుంచి వెళ్లే వారిని సైతం లోపలికి ఆహ్వానించేలా కనిపించాలి. నగర వాసులకు ఆహ్లాదం, ఆరోగ్యాన్ని అందించేదిగా ఉండాలి. కనువిందు చేయాలి. కానీ హనుమాన్‌పేటలోని చిట్టూరి విశ్వేశ్వరయ్య పార్క్ ఇందుకు పూర్తి భిన్నం. పార్క్ ముందు భాగంలో పార్కింగ్ టైల్స్ దెబ్బతిన్నాయి. అక్కడే వాటిపై మలమూత్రాలు విసర్జిస్తున్నారు. ఇక గేటు దగ్గర లోపలికి వెళ్లే మార్గంలో రాళ్లు, చెత్తతో నిండి ఉంది. లోపల ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌పై నడిచేందుకు వీలు లేకుండా పిచ్చి మొక్కలు, గడ్డి మొలిచింది. పిల్లలకు ఏర్పాటు చేసిన ఆట వస్తువులు గడ్డి మధ్యలో పడిపోయి ఉన్నాయి. విరిగిపోయిన చెట్ల కొమ్మలు అడ్డుగా పడి ఉన్నాయి. పార్క్‌లో ఓ వైపు మోకాళ్ల కంటే ఎత్తుగా పిచ్చి మొక్కలు పెరిగాయి. పార్క్ పూర్తిగా కళ తప్పి.. అడవిని తలపిస్తోంది. నగరం మధ్యలో ఉన్న పార్క్ అధ్వాన స్థితికి చేరుకుంది. ట్రావెల్ ఏజెన్సీలు ఎక్కువగా ఉండటంతో పార్క్ గేటుకు ఎదురుగా ప్రైవేటు బస్సులు నిలిపివేస్తున్నారు. డ్రైవర్లు, క్లీనర్లు అక్కడే పార్క్ ఫుట్ పాత్‌పై స్నానాలు చేస్తున్నారు. ఇక గంజాయి బ్యాచ్ కూడా చేరడంతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. పార్క్ పరిసరాల్లో పారిశుద్ధ్యం దారుణంగా తయారైంది. పార్క్ లోపల టాయిలెట్లు నిర్వహణ లేక ధ్వంసమైపోయాయి.



పార్క్ గేట్ లోపలి భాగం



పడిపోయిన చెట్టు కొమ్మలు, గడ్డి మధ్య ఓపెన్ జిమ్ పరికరాలు

సగంలో నిలిచిపోయిన పనులు

పార్క్ అభివృద్ధికి రూ. 27.64లక్షలు కేటాయించారు. వాకింగ్ ట్రాక్ అభివృద్ధి, ప్రధాన గేటు, ఆట వస్తువులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ఇక్కడ అభివృద్ధి పనులు అరకొరగానే జరిగాయి. ఇనుప వస్తువులు పార్క్‌లో అడ్డదిడ్డగా పడి ఉన్నాయి. విలువైన పరికరాలు అమర్చకుండా వదిలేశారు. పార్క్‌లో సిబ్బంది సైతం పనిచేయలేని వాతావరణం నెలకొంది. విద్యుత్ దీపాలు కూడా సక్రమంగా వెలగడం లేదు. కొన్ని ధ్వంసమైపోయాయి.



అధ్వానంగా పార్క్ ఎదురు ఫుట్‌పాత్



బోర్డు కూడా ఏర్పాటు చేయని ప్రధాన గేటు



పిచ్చిమొక్కలు, గడ్డి మొలిచి కనిపించకుండా ఉన్న వాకింగ్ ట్రాక్

పరిశీలించి పనులు చేయిస్తాం

రెండు రోజుల క్రితమే బాధ్యతలు చేపట్టాను. పార్క్‌ను పరిశీలిస్తాను. నిధులు ఎంత కేటాయించారు? పనులు ఏ మేరకు జరిగాయి అన్నీ పరిశీలించి.. ఏవైనా పనులు మిగిలి ఉంటే పూర్తి చేయించేందుకు కృషి చేస్తా.

– వెంకటేశ్వరరెడ్డి, ఈఈ

క్లుప్తంగా

ప్రచార ఆర్భాటం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ ఆర్‌యూబీ ప్రచార ఆర్భాటాలకు వేదికగా మారింది. ఇక్కడ ఆర్‌యూబీ వద్ద మొదటి నుంచి చివరి వరకు అధికార పార్టీకి చెందిన భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. రోడ్డుపై చిన్నపాటి ఫ్లెక్సీలు కనిపిస్తేనే తొలగించే టౌన్ ప్లానింగ్ అధికారులు ఇక్కడ భారీ ఫ్లెక్సీలను మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. అధికారుల తీరు వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కోల్పోయే ప్రమాదం ఉందని స్థానికులు అంటున్నారు. అలాగే రైల్వే అధికారులు సైతం ఆర్‌యూబీ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చూసీ చూడనట్లు వ్యవహరించడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాంపౌండ్ వాల్ నిర్మాణం ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల వివాదాస్పదంగా మారిన మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డు ఇరిగేషన్ స్థలం అన్యాక్రాంతం కాకుండా ముందస్తు జాగ్రత్తగా కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇక్కడ కాంపౌండ్ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరు చేశారు. అయితే అధికారుల నిర్లక్ష్యంతో పనులు ప్రారంభం కాలేదు. ఇటీవల ఇక్కడ ఆక్రమణలు జరుగుతుండటంతో స్పందించిన అధికారులు ఇప్పుడు కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టారు.

నిత్యావసరాల పంపిణీ



పాయకాపురం(విజయవాడరూరల్): గత నెలలో సంభవించిన వరదల కారణంగా నష్టపోయిన బాధిత కుటుంబాలకు ఫినోలెక్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ముకుల్ మాధవ్ ఫౌండేషన్ సహకారంతో పాయకాపురంలోని స్పందన సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఫినోలెక్స్ ఏపీ, తెలంగాణ ఏరియా మేనేజర్లు సంకా శ్రీహరి, ఎ. భాస్కరరావు, గణేష్ పాల్గొని వరద బాధితులకు నిత్యావసర కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కంపెనీ తరఫున వరద బాధితులకు సుమారు రూ. 20 లక్షల విలువైన నిత్యావసరాలు అందజేసినట్లు తెలిపారు. స్పందన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్, స్పందన వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి డి.మురళి, లక్ష్మీదీప్తి ఏజెన్సీస్ ప్రొప్రయిటర్ సిహెచ్‌వి. గణేష్, లీగల్ అడ్వైజర్ కె. నరసింహామూర్తి, ఆర్ఎస్ నాయుడు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): చుట్టుగుంట విద్యుత్ సబ్‌స్టేషన్ ఎస్ఆర్ఆర్ ఫీడర్ పరిధిలో వైర్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ పీ రవీంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చుట్టుగుంట రామాలయం రోడ్డు, గులామొహిద్దీన్ నగర్ కొండ ప్రాంతం, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్, ఎస్‌బీఐ బిల్డింగ్, మారుతీ నగర్, ఏలూరు రోడ్డు, మైహోమ్ అపార్ట్‌మెంట్, ఎస్ఆర్ఆర్ కళాశాల ఏరియా, కళాశాల వెనుక కాలువగట్టు, పాత మలేరియా ఆఫీసు రోడ్డు, హిందీ కళాశాల రోడ్డు, దుగ్గిరాల బలరామకృష్ణయ్య వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నరుపేట సెక్షన్ మ్యూజియం విద్యుత్ సబ్‌స్టేషన్ 11 కేవీ బీసెంట్ రోడ్డు ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం ఆదివారం ఉదయం ఏడు నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ రవీంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెల్ప్ హాస్పిటల్ రోడ్డు, కస్పావారి వీధి, పాలపర్తివారి వీధి, బీసెంట్ రోడ్డు, గోపాలరెడ్డి రోడ్డు, యామలవారి వీధి, కాంగ్రెస్ ఆఫీసు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

30న లక్ష్మీ కుబేరవ్రతం

పటమట(విజయవాడతూర్పు): పటమట దత్త పీఠంలో జయలక్ష్మి మాతృమండలి ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ లక్ష్మీ కుబేర వ్రతం నిర్వహిస్తున్నట్లు మండలి నిర్వాహకులు స్రవంతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి వ్రతం జరుగుతుందని, ఇందులో పాల్గొనాలనుకునేవారు 86887 88331 నంబర్లో సంప్రదించాలని ఆమె కోరారు.

ప్రజాసేవలో భాగస్వాములు కావాలి

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని కళాంజలి సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు తొట్టెంపూడి రమేష్ అన్నారు. కళాంజలి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళా వేదికపై శనివారం బహుభాషా గాయకుడు జేసుదాసుకు స్వరాంజలి, డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావుకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన రమేష్ మాట్లాడుతూ సాంస్కృతిక సంస్థలు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ జేసుదాసు బహుభాషా గాయకుడని ఆయన సేవలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావును నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు రసూల్‌బాబు, సత్యవర్ధన్, ఎ.సాంబశివరావు, గాయత్రి సినీ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన అశోక్, ముత్యాల వెంకట్రావ్, గాలి శ్రీనివాస్, కే వెంకట రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసంహారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

‘కోపా’ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): కుల మతాలకు అతీతంగా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించేందుకు కాపు అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(కోపా) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోపా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ దావులూరి కైలాసరావు, డి.రమేష్ కుమార్ తెలిపారు. విజయవాడ ముత్యాలంపాడులో శనివారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కోపా గత 27 ఏళ్లుగా ఉమ్మడి కృష్ణా జిల్లాలకు చెందిన మెరిట్ విద్యార్థులను గుర్తించి ఏటా ఉపకార వేతనాలు అందజేసి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.తమ వద్ద ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులే దాతలుగా మారి కోపాకు సహకరించడం సంతోషంగా ఉందన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, మెడిసిన్, డిప్లమో తదితర కోర్సులు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు kopakrishnavja@gmail.com కు అభ్యర్థన పంపితే దరఖాస్తు పంపిస్తామని చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తులకు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు జత చేసి వచ్చే నెల 20వ తేదీలోపు పంపించాలని సూచించారు. మరింత సమాచారం కోసం 94402 39989, 70936 39919 నంబర్లు, ఈ మెయిల్ ఐడీల ద్వారా సంప్రదించాల్సిందిగా వారు కోరారు. సమావేశంలో కోపా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి సంజీవ్, కోశాధికారి గాజుల రామారావు, ఎక్స్ అఫీషియో సభ్యులు కొప్పరాతి వెంకట రమణారావు, రామాయణం నాగసత్యం, గల్లా భాస్కర్ రావు, బెల్లం సత్యనారాయణ, పులుగుజ్జు ప్రసాద్, బీవీ సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కైలాసరావు తదితరులు

దేవీనగర్ నుంచి ఎన్ఆర్ఐకి బస్ సర్వీస్‌లు

బస్టాండ్(విజయవాడపశ్చిమ): నగరంలోని దేవీనగర్ నుంచి ఎన్ఆర్ఐకి ఈనెల 28 నుంచి నూతన బస్ సర్వీస్‌లు నడపనున్నట్లు గవర్నర్‌పేట-1 డిపో మేనేజర్ కె. బసవయ్య శనివారం ఒక ప్రకటలో తెలిపారు. రూట్ నెంబర్ 14/ 14ఏ/ 14ఎస్ నెంబర్‌లతో నడిచే ఈ సర్వీసు దేవీనగర్‌లో ఉదయం 7.15, 9.45, మధ్యాహ్నం 3.35 గంటలకు వయా మధురానగర్ జంక్షన్, గులాబీ తోట, డీమార్ట్, రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్, వారధి, ఎయిమ్స్, మంగళగిరి ఎన్ఆర్ఐ వరకు నడుస్తుంది. అదేవిధంగా ఎన్ఆర్ఐ నుంచి దేవీనగర్ మధ్య ఉదయం 6.10, 8.40, మధ్యాహ్నం 2.30, సాయంత్రం 5.05 గంటలకు ఈ సర్వీసు నడుస్తుంది. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బాబా మందిరంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): శివకేశవులకు ప్రీతికరమైన కార్తిక మాసంలో ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సామూహిక రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 3, 10, 17, 24 తేదీల్లో ఉదయం తొమ్మిది గంటలకు వ్రతాలు జరుగుతాయన్నారు. అలాగే 4, 11, 12, 15, 18, 24, 26వ తేదీల్లో సాయంత్రం 6.30 గంటలకు సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఏర్పాటు చేశామన్నారు. 10వ తేదీ ఆదివారం నున్న గుంటక సత్యనారాయణ మామిడి తోటలో వన సమారాధన, సత్యనారాయణ వ్రతం జరుగుతుందని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దోమల నివారణ చర్యలు

సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): స్థానిక 30వ డివిజన్ జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్‌లో నగరపాలక సంస్థ దోమల నివారణ చర్యలు చేపట్టింది. ఇక్కడ వర్షపు నీరు, మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు పెరిగిపోయాయి. స్థానికులు పడుతున్న అవస్థలు వివరిస్తూ శుక్రవారం సాక్షి ‘చెరువులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు’ శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన మలేరియా విభాగం అధికారులు నీటి నిల్వ ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేశారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రామకోటేశ్వరరావు, బయాలజిస్టు, మలేరియా విభాగం అధికారులు పాల్గొన్నారు.



ఆయిల్ బాల్స్ వేస్తున్న దృశ్యం

మధురం వాగ్గేయకార సంకీర్తనం

విజయవాడ కల్చరల్: సంగీత విద్వాంసుడు శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యుల వారి శత జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా గాంధీనగర్‌లోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీత, సాహిత్య ఉత్సవాలు మధురంగా సాగుతున్నాయి. శనివారం నాటి కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు వాగ్గేయకార కీర్తనలను ఆలపించారు. శివసాయి చరణ్, భవ్యశ్రీ గీతిక, కీర్తన గాత్ర యుగళం, వైద్యనారాయణ పండిట్, టీ మాణిక్యలక్ష్మి, సాత్విక మోహన్, విష్ణుభొట్ల సోదరీమణులు, కృష్ణమాచార్యుల సంగీత వారసులు సీ కౌశిక్ కల్యాణ్, కే సుబ్రహ్మణ్యరాజు, కే మురళీమోహన్ వయోలిన్‌పై సంప్రదాయ కీర్తనలను పలికించారు. శత జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా శతావధాని డాక్టర్ వారణాసి శివరామకృష్ణ, సంగీత కళాకారులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాపీఠం క్రియాశీలక సభ్యులు ఎన్‌సీహెచ్ బుచ్చయ్యా చార్యులు, టీకేవీ రామానుజాచార్యులు, శ్రీరామ చక్రవర్తి, రాఘవాచార్యులు పాల్గొన్నారు.



సంప్రదాయ కీర్తనలను వాయిలీనంపై పలికిస్తున్న కౌశిక్ కల్యాణ్

మాదకద్రవ్యాలు ఆరోగ్యానికి హానికరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాదకద్రవ్యాలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని కావున యువత వాటికి దూరంగా ఉండాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొడాలి విద్యాసుధాకర్ సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని కంచికచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో శనివారం మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాదకద్రవ్యాల వల్ల యువతకు కలిగే నష్టాలను వివరించారు. మాదకద్రవ్యాల వినియోగం, అమ్మకం చట్టరీత్యా నేరమని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నీరజ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ కె. బాలకృష్ణ, లావణ్య, అరుణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

పాయకాపురం(విజయవాడ రూరల్): ప్రపంచ ఆరోగ్యానికి ఆయుర్వేద ఆవిష్కరణలు అనే నినాదంతో ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. దాసాంజనేయ దేవస్థానం సహకారంతో నిర్వహించిన శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో ఆయుర్వేద వైద్య సేవలను విస్తృతపరుస్తుందన్నారు. 9వ ఆయుర్వేద దినోత్సవ వేడుకలను ఈనెల 29వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఔషద మొక్కలను ప్రజలకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఏజేవీ సాయిప్రసాద్, డాక్టర్ కే అనుమోల్ పాల్గొన్నారు.



ఔషధ మొక్కలు అందజేస్తున్న ఏడీ డాక్టర్ వెంకటేశ్వర్లు

నగరంలో ఓపెన్ హౌస్

పోలీసు అమరవీరుల సంస్మరణ దినం -2024 వారోత్సవాల్లో భాగంగా శనివారం ఎంజీ రోడ్డు సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. సీపీ రాజశేఖరబాబు, డీసీపీ గౌతమిశాలి గన్‌లను పరిశీలించారు. విద్యార్థులకు గన్ షూట్ చేయడంపై అవగాహన కల్పించారు. ఆయుధాల పనితీరును ఓపెన్‌హౌస్‌కు వచ్చిన విద్యార్థులు పరిశీలించారు. అగ్నిమాపక, సైబర్‌నేరాలు, పోలీస్ డాగ్స్ విన్యాసాలు, ఫింగర్ ప్రింట్స్ తీసుకోవడం తదితర అంశాలను వివరించారు. పోలీస్ డాగ్స్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



విద్యార్థులకు ట్రాఫిక్ పోలీస్ బైక్ విశిష్టతను తెలుపుతున్న పోలీస్



పోలీస్ డాగ్ విన్యాసాలు



పోలీస్ అమరవీరులు సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఓపెన్‌హౌస్‌లో గన్‌లను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు, డీసీపీ గౌతమిశాలి తదితరులు



ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పోలీస్ కటౌట్ వద్ద విద్యార్థి





గన్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు